కేసీఆర్‌ను తిడితే గొప్పోడివి కావు: సబితా

బడంగ్ పేట్, మార్చి 13: సీఎం రేవంత్‌రెడ్డి కారుకూతలు మానుకోక పోతే ప్రజలే ఛీకొడుతారని మాజీ మంత్రి సబితా ఇంద్రారెడ్డి హితవుపలికారు. ప్రజాస్వామ్య విలువలకు విరుద్ధంగా ఆయన మాటలు ఉన్నాయని మండిపడ్డారు. రాష్ట్రాన్ని సాధించిన కేసీఆర్‌పై ఇలాంటి మాటలు సరికాదని పేర్కొన్నారు. కేసీఆర్ పదేండ్ల పాలన సుభిక్షంగా ఉంటే, కాంగ్రెస్ ఏడాదిన్నర పాలనలోనే నరకాన్ని చూపిస్తున్నారని మండిపడ్డారు. రైతాంగం గోసను పట్టించుకోకుండా, కేవలం బీఆర్ఎస్ అధినేతపై విమర్శలకే సీఎం రేవంత్ పరిమితమయ్యారని విమర్శించారు. సీఎం రేవంత్‌రెడ్డి వెంటనే కేసీఆర్‌కు బేషరతుగా క్షమాపణలు చెప్పాలని ఆమె డిమాండ్ చేశారు.

రేవంత్ నోరు అదుపులో పెట్టుకోవాలి: కొప్పుల

హైదరాబాద్, మార్చి 13 (నమస్తే తెలంగాణ): సీఎం రేవంత్‌రెడ్డి నోరు అదుపులో పెట్టుకోవాలని మాజీ మంత్రి కొప్పుల ఈశ్వర్ హితవుపలికారు. కారు కూతలు మానుకోవాలని, లేకపోతే త్వరలోనే ప్రజలు కాంగ్రెస్ పార్టీకి బుద్ధి చెప్తారని హెచ్చరించారు. ఉద్యమనేతగా రాష్ట్రాన్ని సాధించి, నాలుగున్నర కోట్ల ప్రజలు ఆరాధిస్తున్న కేసీఆర్‌ను దూషిస్తే గొప్పవారు కాలేరని మండిపడ్డారు. కేసీఆర్‌పై మాట్లాడిన మాటలను వెనక్కి తీసుకోవాలని, బేషరతుగా క్షమాపణలు చెప్పాలని డిమాండ్ చేశారు.

విజ్ఞులు ఇలా మాట్లాడరు: క్రాంతికిరణ్

హైదరాబాద్, మార్చి 13 (నమస్తే తెలంగాణ): బీఆర్ఎస్ అధినేత కేసీఆర్‌పై సీఎం రేవంత్‌రెడ్డి వ్యాఖ్యలు సరికాదని, విజ్ఞులెవరూ ఇలా మాట్లాడరని బీఆర్ఎస్ మాజీ ఎమ్మెల్యే క్రాంతికిరణ్ మండిపడ్డారు. ఈ విషయంలో కేసీఆర్‌కు వెంటనే క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు. గౌరవ ప్రదమైన హోదాలో ఉన్న వ్యక్తి ఈ రాష్ట్రంలో అందరి మంచిని కోరుకోవాలని హితవుపలికారు. రాష్ట్ర సాధన ఉద్యమానికి సారథ్యం వహించిన కేసీఆర్ మార్చురీలోకి త్వరలో పోతారంటూ వ్యాఖ్యలు చేయడం బాధాకరమని అభిప్రాయపడ్డారు. హామీలను అమలు చేయలేక ప్రస్టేషన్‌లో ఏం మాట్లాడుతున్నాడో అర్థం కావడం లేదని ఎద్దేవా చేశారు.

దక్షిణాది రాష్ట్రాలు ఐక్యంగా పోరాడాలి

- జనాభా ఆధారంగా డీలిమిటేషన్ చేస్తే దక్షిణాదికి తీవ్ర అన్యాయం
- చెన్నైలో 22న జరిగే సమావేశానికి బీఆర్ఎస్ పార్టీ హాజరవుతుంది: కేటీఆర్
- డీఎంకే నేతల బృందంతో భేటీ

బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్‌కు ఆహ్వాన పత్రం అందజేస్తున్న డీఎంకే మంత్రి కేఎన్ నెహ్రూ, రాజ్యసభ సభ్యుడు ఎన్ఆర్ ఎలాంగో బృందం.. చిత్రంలో శాసనమండలి ప్రతిపక్ష నేత మధుసూదనాచారి, ఎంపీలు వద్దిరాజు రవిచంద్ర, దీవకొండ దామోదర్‌రావు, మాజీ మంత్రులు వేముల ప్రశాంత్‌రెడ్డి తదితరులు

హైదరాబాద్, మార్చి 13 (నమస్తే తెలంగాణ): జనాభా ఆధారంగా కేంద్రప్రభుత్వం జరపాలనుకుంటున్న డీలిమిటేషన్‌తో దక్షిణాది రాష్ట్రాలకు తీవ్ర అన్యాయం జరుగుతుందని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కే తారకరామారావు విమర్శించారు. కేంద్రం సూచనల మేరకు కుటుంబ నియంత్రణను పకడ్బందీగా అమలుచేసిన తెలంగాణ, ఆంధ్రప్రదేశ్, తమిళనాడు, కేరళ, కర్ణాటక రాష్ట్రాల ప్రాతినిధ్యాన్ని తగ్గించాలనుకోవడం దారుణమని మండిపడ్డారు. తమిళనాడు సీఎం స్టాలిన్ ఆధ్వర్యంలో మార్చి 22న చెన్నైలో నిర్వహించతలపెట్టిన సమావేశానికి బీఆర్ఎస్‌ను ఆహ్వానించేందుకు హైదరాబాద్‌కు వచ్చిన డీఎంకే నేతలు, ఆ రాష్ట్ర మంత్రి కేఎన్ నెహ్రూ, రాజ్యసభ సభ్యుడు ఎన్ఆర్ ఎలాంగో బృందంతో తెలంగాణ భవన్‌లో కేటీఆర్ సమావేశమయ్యారు. అనంతరం ఇరు పార్టీల నేతలతో కలిసి మీడియాతో మాట్లాడారు. ఇది డీలిమిటేషన్‌పై దక్షిణాది రాష్ట్రాలు ఐక్యంగా పోరాడాల్సిన సందర్భమని పేర్కొన్నారు. తెలంగాణ, తమిళనాడు, కేరళ, కర్ణాటక, ఆంధ్రప్రదేశ్ సమష్టిగా పోరాడితే తప్పకుండా దక్షిణాది రాష్ట్రాలకు న్యాయం జరుగుతుందని చెప్పారు. 1970-80 దశకంలో కుటుంబ నియంత్రణను విజయవంతంగా అమలుచేసిన దక్షిణాది రాష్ట్రాల పార్లమెంట్ స్థానాలను కొత్త జనాభా లెక్కల ప్రకారం నిర్ణయిస్తామనడం అన్యాయమని పేర్కొన్నారు. ఈ విషయంలో తమిళనాడు సీఎం ఎంకే స్టాలిన్ నిర్వహించనున్న అఖిలపక్ష సమావేశానికి బీఆర్ఎస్ తరపున హాజరుకావాలని తమ పార్టీ అధినేత కేసీఆర్ ఆదేశించినట్టు తెలిపారు. సమావేశంలో బీఆర్ఎస్, తెలంగాణ వాదనను బలంగా వినిపిస్తామని వెల్లడించారు.

స్టాలిన్ మొదటి నుంచి పోరాటం

డీలిమిటేషన్‌తో దక్షిణాది రాష్ట్రాలకు జరిగే అన్యాయాన్ని తమిళనాడు ముఖ్యమంత్రి స్టాలిన్ మొదటి నుంచి ప్రశ్నిస్తున్నారని డీఎంకే నేతలు కేఎన్ నెహ్రూ, ఎన్ఆర్ ఎలాంగో తెలిపారు. అందులో భాగంగా మార్చి 22న దక్షిణాది రాష్ట్రాల్లోని అన్ని పార్టీలతో చెన్నైలో సమావేశం ఏర్పాటు చేస్తున్నట్టు పేర్కొన్నారు. ఆ సమావేశంలో అన్ని పార్టీలతో చర్చించి ఉమ్మడి కార్యాచరణ ప్రకటిస్తామని వెల్లడించారు. అఖిలపక్ష సమావేశానికి హాజరవుతామన్న బీఆర్ఎస్‌కు ధన్యవాదాలు తెలిపారు. సమావేశంలో శాసనమండలి ప్రతిపక్ష నేత మధుసూదనాచారి, ఎంపీలు వద్దిరాజు రవిచంద్ర, దీవకొండ దామోదర్‌రావు, మాజీ మంత్రులు జగదీశ్‌రెడ్డి, వేముల ప్రశాంత్‌రెడ్డి, ఎమ్మెల్సీలు తాతా మధు, శేరి సుభాష్‌రెడ్డి, దాసోజు శ్రవణ్, మాజీ ఎంపీలు బడుగుల లింగయ్యయాదవ్, రావుల చంద్రశేఖర్‌రెడ్డి, మాజీ ఎమ్మెల్యే గాదరి కిశోర్‌కుమార్, కూసుకుంట్ల ప్రభాకర్‌రెడ్డి, నాయకులు దూదిమెట్ల బాలరాజ్, శుభప్రద్ పటేల్, కిశోర్ గౌడ్, కురువ విజయ్, సతీశ్, సుమిత్రాఆనంద్ తదితరులు పాల్గొన్నారు.

రేవంత్.. ఏందీ నీచమైన భాష!

- మా సీఎం అని చెప్పకోవాలంటే బయట సిగ్గయితున్నది!
- నువ్వు ఉండాల్సింది ఇక్కడ కాదు.. ఎర్రగడ్డ మెంటల్ హాస్పిటల్‌లో
- బాధ్యత, హోదా మరచి అడ్డగోలుగా వ్యాఖ్యలేంటి?
- కేసీఆర్‌పై ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి వ్యాఖ్యలను తీవ్రంగా ఖండిస్తూ నెటిజన్ల మండిపాటు, ఆగ్రహం

(స్పెషల్ టాస్క్ బ్యూరో)

హైదరాబాద్, మార్చి 13: తెలంగాణ తొలి ముఖ్యమంత్రి కేసీఆర్ పట్ల సీఎం రేవంత్‌రెడ్డి చేసిన వ్యాఖ్యలపై యావత్ తెలంగాణ సమాజం భగ్గుమంటున్నది. సామాజిక మాధ్యమాల్లో తీవ్ర అభ్యంతరాలు వ్యక్తమవుతున్నాయి. రాష్ట్రానికి ముఖ్యమంత్రిగా, నాలుగు కోట్ల మంది ప్రజలను నడిపించాల్సిన హోదాలో ఉండి, స్ట్రెచర్, మార్చురీ అంటూ మాట్లాడడం దారుణమని సామాన్యుల నుంచి ప్రముఖుల వరకు, యువత, పెద్దలు ఖండిస్తున్నారు. చావునోట్లో తలపెట్టి తెలంగాణ సాధించిన ఉద్యమనేతగా, తెలంగాణ తొలి ముఖ్యమంత్రిగా సమాజంలో గౌరవప్రదమైన స్థాయిలో ఉన్న కేసీఆర్‌ను ఉద్దేశించి కీడును కోరుకుంటూ వ్యాఖ్యలు చేయడం మానవత్వమేనా అని ప్రశ్నిస్తున్నారు. ఇలా ఒక్కొక్కరు ఒక్కో రీతిలో రేవంత్‌రెడ్డి వైఖరిని సోషల్ మీడియా వేదికగా తూర్పార పడుతున్నారు. రేవంత్‌రెడ్డి గతంలో చేసిన వ్యాఖ్యల దృశ్యాలను కూడా ఓ చోట చేర్చి, ముందు నుంచీ ఇదే తీరు, ఇక మారదా అంటూ వ్యంగ్యాస్త్రాలు సంధిస్తున్నారు.



మళ్లీ మళ్లీ మరింతగా దిగజారి!

కేసీఆర్‌పై రేవంత్ వ్యాఖ్యలను నెటిజన్లు తీవ్రంగా తప్పుపడుతున్నారు. 'నువ్వు సీఎం అని చెప్పుకోవాలంటేనే సిగ్గుపడేలా చేస్తున్నావ్' అని డీ పేరిట ఉన్న 'ఎక్స్' హ్యాండిల్‌లో ఓ యూజర్ పోస్ట్ చేయగా 'అతడు సీఎం అనే విషయాన్ని ఎవరైనా రేవంత్‌కు గుర్తుచేయండి' అని బన్నీ అనే మరో వ్యక్తి కామెంట్ చేశాడు. 'కేసీఆర్ తెలంగాణ కోసం ప్రాణాలు పణంగా పెట్టి పోరాడారు, రేవంత్ మాత్రం సీఎం అయ్యాక నీచమైన మాటలకే పరిమితమయ్యాడు. సీఎంగా కాదు ఓ గూండాలా మాట్లాడుతున్నాడు' అని తెలంగాణ్టైట్ అనే హ్యాండిల్ నుంచి రఘునాథ్ అనే నెటిజన్ పోస్ట్ చేశాడు. 'నువ్వు ఇంతకంటే దిగజారవు అనుకున్న ప్రతీసారీ ఇంకా దిగజారుతూనే ఉన్నావ్" అంటూ 'జెర్సీ' మూవీలో డైలాగ్‌తో మీమ్స్ క్రియేట్ చేస్తున్నారు. 'ఛీ.. ఛీ.. ఇంతకన్నా దిగజారవు అనుకున్న ప్రతీసారి యూ ప్రూవ్డ్ మీ రాంగ్..' అంటూ బిజ్జాస్ అనే ఓ నెటిజన్ ట్వీట్ చేశాడు. 'ఇలాంటి దరిద్రపు సీఎంను నా లైఫ్‌లో చూడలేదు' అని దుర్గమ్ సదానందమ్ అనే నెటిజన్ వ్యాఖ్యానించగా 'ఇతను ఉండాల్సింది ఎర్రగడ్డ హాస్పిటల్‌లో' అని రవి అనే వ్యక్తి ట్వీట్ చేశాడు. 'కాంగ్రెస్‌కు ఓటేసినందుకు బాధపడుతున్నా' అని మింటు అరవింద్ అనే నెటిజన్ వ్యాఖ్యానించగా, రేవంత్‌ది నీచమైన ఆలోచన అంటూ కొండయ్య అనే వ్యక్తి ఆవేదన వ్యక్తంచేశాడు.

నీరా కేఫ్ ఎప్పటికీ గౌడన్నలదే

- జీసీలకు 42% రిజర్వేషన్లు: మంత్రి పొన్నం

హైదరాబాద్, మార్చి 13 (నమస్తే తెలంగాణ): హైదరాబాద్ నెక్లెస్ రోడ్‌లోని నీరాకేఫ్ ఎప్పటికీ గౌడన్నలకే చెందుతుందని, ఆ సామాజిక వర్గం వారే దాని ఫలాలు పొందుతారని బీసీ సంక్షేమశాఖ మంత్రి పొన్నం ప్రభాకర్‌గౌడ్ తేల్చిచెప్పారు. నీరాకేఫ్‌ను పర్యాటక శాఖ నుంచి కల్లుగీత పారిశ్రామిక కార్పొరేషన్‌కు కేటాయిస్తూ మంత్రులు చేసుకున్న ఒప్పందంతో గురువారం వివిధ గౌడ సంఘాల నేతలు మంత్రి పొన్నం ప్రభాకర్‌ను కలిసి కృతజ్ఞతలు తెలిపారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ 'కాటమయ్య రక్షణ కవచం' పేరుతో ఇస్తున్న సేఫ్టీ కిట్లను తొలి దఫాలో 10 వేల మందికి ఇచ్చామని, రెండో దఫాలో మరో 15వేల మంది వృత్తిదారులకు అందజేస్తామని వెల్లడించారు. ఈ అసెంబ్లీ సమావేశంలోనే బీసీలకు 42% రిజర్వేషన్ బిల్లును ఆమోదిస్తామని తెలిపారు. కల్లుగీత కార్మికులు ఎదుర్కొంటున్న సమస్యలను గౌడజన హక్కుల పోరాట సమితి యెలికట్టె విజయ్‌కుమార్‌గౌడ్ మంత్రి దృష్టికి తీసుకెళ్లారు. ఆయా విషయాలపై సీఎంతో చర్చిస్తామని హామీ ఇచ్చారు.

లోకం పోకడ



మా గులాబీ రంగు బట్టలుచూసి ఎందుకు సార్ అంత షాక్ అవుతారు? వస్తుంటే బయట రంగు చల్లారు అంతే!

తెలంగాణ సమాజానికి రేవంత్ క్షమాపణ చెప్పాలి

- మాజీ మంత్రి గంగుల కమలాకర్
- సీఎం మాట్లాడాల్సిన భాషేనా?: సుధీర్
- రేవంత్ మానసిక పరిస్థితి బాలేదు: వివేకానంద

హైదరాబాద్, మార్చి 13 (నమస్తే తెలంగాణ): బీఆర్ఎస్ అధినేత కేసీఆర్‌పై వాడిన భాషకు సీఎం రేవంత్‌రెడ్డి తెలంగాణ సమాజానికి క్షమాపణ చెప్పాలని మాజీ మంత్రి గంగుల కమలాకర్ డిమాండ్ చేశారు. గురువారం అసెంబ్లీ మీడియా పాయింట్ వద్ద ఎమ్మెల్యేలు సుధీర్‌రెడ్డి, కేపీ వివేకానందతో కలిసి ఆయన మాట్లాడారు. సీఎం రేవంత్‌రెడ్డి వాడిన భాషను రాష్ట్ర ప్రజలు ఛీత్కరించుకుంటున్నారని మండిపడ్డారు. గతంలో సీఎంలుగా పనిచేసిన వైఎస్సార్, రోశయ్య, కిరణ్‌కుమార్‌రెడ్డి, కేసీఆర్ పాలసీలపై మాత్రమే మాట్లాడేవాళ్లని గుర్తుచేశారు. కానీ రేవంత్‌రెడ్డి అసహనంతోనే ఇష్టమొచ్చినట్టు మాట్లాడుతున్నారని విమర్శించారు. రేవంత్‌రెడ్డి సీఎంగా ఉన్న సభలో ఎమ్మెల్యేలుగా ఉన్నందుకు అవమానకరంగా భావిస్తున్నామని చెప్పారు. ఎమ్మెల్యే సుధీర్ రెడ్డి మాట్లాడుతూ.. రేవంత్‌రెడ్డి భాష అభ్యంతరకరంగా ఉందని, సీఎంగా మాట్లాడాల్సిన భాషేనా అంటూ ప్రశ్నించారు. కేసీఆర్‌తో పాటు ఆయన కుటుంబసభ్యులను ఎలా తిట్టాలనే సీఎం గత 15నెలలుగా చూస్తున్నారని మండిపడ్డారు. ఎమ్మెల్యే కేపీ వివేకానంద మాట్లాడుతూ.. రేవంత్ రెడ్డి తన అసమర్థతను కప్పిపుచ్చుకోవడానికి అసభ్యంగా మాట్లాడుతున్నారని ఆగ్రహం వ్యక్తంచేశారు. రేవంత్ మానసికస్థితి సరిగా లేదని, ఆయనను కాంగ్రెస్ అధిష్ఠానం పట్టించుకోవడం లేదని విమర్శించారు. పాలన చేతకాకపోవడంతోనే గవర్నర్‌తో అబద్ధాలు చెప్పించారని ఆరోపించారు. కాళేశ్వరం అనే పవిత్రమైన పేరును సీఎం కూలేశ్వరం అనడం ఏంటని ప్రశ్నించారు.

ఎకసెక్కాల రేవంత్‌రెడ్డి: దాసోజు

హైదరాబాద్, మార్చి 13 (నమస్తే తెలంగాణ): 'చెల్లని రుపాయికి గీతలు ఎక్కువ.. చిల్లర రేవంత్‌రెడ్డికి ఎకసెక్కాలు ఎక్కువ' అని బీఆర్ఎస్ నేత దాసోజు శ్రవణ్ ఫైర్ అయ్యారు. బీఆర్ఎస్ అధినేత కేసీఆర్‌పై సీఎం రేవంత్‌రెడ్డి చేసిన వ్యాఖ్యలపై గురువారం ఆయన 'ఎక్స్' వేదికగా స్పందించారు. శిశుపాలుడికి శాస్తి జరిగినట్టే రౌడీ మాటలు మాట్లాడుతున్న రేవంత్‌రెడ్డికి గుణపాఠం చెప్పాల్సిన సమయం ఆసన్నమైందని పేర్కొన్నారు. 'పరిపాలన చేతకాదు.. వాగ్దానాలు అమలు చేయరాదు.. పనికిరాని బూతులకే రేవంత్‌రెడ్డి పరిమితమయ్యారని విమర్శించారు. తన అహంకారపు ధోరణితో నీచ రాజకీయాల మడుగులో మునిగి, తన అసలు స్థాయిని మరోసారి చాటుకున్నారని విమర్శించారు. తండ్రి వయసున్న కేసీఆర్‌ను అవహేళన చేయడం, శాపనార్థాలు పెట్టడం.. పరోక్షంగా బెదిరింపులకు దిగడం రేవంత్‌లోని హీన మనస్తత్వానికి అద్దం పడుతున్నదని మండిపడ్డారు. స్వీయ నియంత్రణ లేని కోతి గద్దెమీద కూర్చున్నా.. సంస్కారం లేని మూర్ఖుడు సీఎం కుర్చీలో కూర్చున్నా.. ఎలా ఉంటుందో రేవంత్ నిత్యం నిరూపిస్తున్నాడని దుయ్యబట్టారు.

రిటర్నింగ్ అధికారి నుంచి ధ్రువపత్రాన్ని అందుకుంటున్న దాసోజు శ్రవణ్

ఎమ్మెల్యే కోటా ఎమ్మెల్సీల ఏకగ్రీవం

- ధ్రువపత్రాలు అందజేసిన రిటర్నింగ్ అధికారి

హైదరాబాద్, మార్చి 13 (నమస్తే తెలంగాణ): ఎమ్మెల్యే కోటా ఎమ్మెల్సీల ఎన్నిక ఏకగ్రీవమైంది. మండలిలో ఖాళీ కానున్న ఐదు స్థానాలకు ఐదుగురే నామినేషన్ వేశారు. ఈ ఎన్నికలకు గత నెల 25వ తేదీన నోటిఫికేషన్ జారీ కాగా, నామినేషన్ల స్వీకరణ, పరిశీలన, ఉపసంహరణ గడువు గురువారంతో ముగిసింది. దీంతో నామినేషన్లు దాఖలు చేసిన ఐదుగురు అభ్యర్థుల విజయం ఏకగ్రీవం అయినట్టు అధికారులు ప్రకటించారు. బీఆర్ఎస్ పార్టీ నుంచి దాసోజు శ్రవణ్, కాంగ్రెస్ నుంచి అద్దంకి దయాకర్, విజయశాంతి, తేజావత్ శంకర్‌నాయక్, మిత్రపక్షమైన సీపీఐ నుంచి నెల్లికంటి సత్యం ఏకగ్రీవంగా గెలిచినట్టు ఎన్నికల రిటర్నింగ్ అధికారి ప్రకటించారు. వారికి వెంటనే అసెంబ్లీ ప్రాంగణంలోని ఎన్నికల రిటర్నింగ్ అధికారి కార్యాలయంలో ధ్రువపత్రాలను సైతం అందజేశారు. ఎమ్మెల్సీలు మహమూద్ అలీ, సత్యవతి రాథోడ్, శేరి సుభాశ్‌రెడ్డి, యెగ్గె మల్లేశం, మీర్జా రియాజుల్ హసన్ పదవీ కాలం ఈ నెల 29తో ముగియనుంది. వీరి స్థానంలో కొత్తగా ఎన్నికైనవారు త్వరలో పదవీ ప్రమాణ స్వీకారం చేయనున్నారు.

నల్లగొండ ఉద్యమానికి దక్కిన గౌరవం: పల్లా

ఎమ్మెల్సీగా నెల్లికంటి సత్యం ఎన్నిక కావడం ఉమ్మడి నల్లగొండ జిల్లా కమ్యూనిస్టు ఉద్యమానికి దక్కిన గౌరవమని సీపీఐ జాతీయ సమితి సభ్యుడు పల్లా వెంకట్‌రెడ్డి కొనియాడారు. నెల్లికంటి సత్యం ఎమ్మెల్సీగా ఎన్నికైన అనంతరం హైదరాబాద్‌లోని సీపీఐ రాష్ట్ర కార్యాలయంలో గురువారం నిర్వహించిన అభినందన సభలో ఆయన మాట్లాడారు. ఉమ్మడి జిల్లాలో రైతులు, కార్మికుల సమస్యల పరిష్కారం కోసం నెల్లికంటి సత్యం కృషి చేయాలని సూచించారు.

రిటర్నింగ్ అధికారి నుంచి ధ్రువపత్రాన్ని అందుకుంటున్న విజయశాంతి

కాంగ్రెస్, బీజేపీ స్నేహ 'హస్తం'?

- సీఎంతో మాపార్టీ నేతల రహస్య మీటింగ్
- ఎమ్మెల్యే రాజాసింగ్ సంచలన వ్యాఖ్యలు
- ఆ రెండూ ఒకటేనని గతంలో కేటీఆర్ విమర్శ
- వాటినే నిజం చేస్తూ రాజాసింగ్ కామెంట్స్

హైదరాబాద్, మార్చి 13 (నమస్తే తెలంగాణ): 'రాష్ట్రంలో ఏ ప్రభుత్వం అధికారంలోకి వస్తే ఆ ముఖ్యమంత్రిని బీజేపీలోని కొందరు ముఖ్య నేతలు రహస్యంగా కలుస్తారు. రహస్య సమావేశాలు పెడితే రాష్ట్రంలో పార్టీ అధికారంలోకి వస్తుందా? రహస్యంగా భేటీ అవుతున్న ఆ నేతలకు బీజేపీ అధిష్ఠానం రిటైర్మెంట్ ఇస్తేనే పార్టీకి మంచి రోజులొస్తాయి. రాష్ట్రంలోని ప్రతి బీజేపీ నాయకుడు, కార్యకర్త ఇదే కోరుకుంటున్నారు' ఇవీ గోషామహల్ బీజేపీ ఎమ్మెల్యే రాజాసింగ్ గురువారం కొందరు తన సొంత పార్టీ నేతలపై చేసిన సంచలన వ్యాఖ్యలు. ఈ వ్యాఖ్యలతో కాంగ్రెస్, బీజేపీ స్నేహ 'హస్తం'పై గత కొన్నాళ్లుగా బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్, ఇతర నేతలు చేస్తున్న విమర్శలు నిజమేనని తేలింది. సీఎం రేవంత్‌రెడ్డితో కొందరు బీజేపీ నేతలు అంటకాగుతున్నారనే విషయం రాజాసింగ్ వ్యాఖ్యలతో తేటతెల్లమైంది. ఆ రెండు పార్టీల చీకటి ఒప్పందమూ బట్టబయలైంది. ఓ వైపు సీఎం రేవంత్‌రెడ్డి, కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి సవాళ్లు, ప్రతిసవాళ్లు విసురుకుంటుండగానే, రాజాసింగ్ చేసిన వ్యాఖ్యలు కాషాయ పార్టీలో దుమారం రేపాయి. మరోవైపు బీజేపీ ఎంపీలు, ఎమ్మెల్యేలు, ముఖ్య నేతలు రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రజా వ్యతిరేక విధానాలను ఖండించకుండా సైలెంట్ అవడం ఈ వాదనకు మరింత బలం చేకూరుస్తున్నది.

ప్రజా సమస్యలపై పోరాటాలు ఏవి?

కృష్ణా జలాలను ఏపీ తరలించుకుపోయినా, ఎస్ఎల్‌బీసీ ప్రమాదంలో 8 మంది చిక్కుకున్నా, రాష్ట్రం నుంచి ఐటీ పరిశ్రమలు తరలిపోతున్నా.. కాషాయ పార్టీ నేతలు మౌనం వహించడం చర్చనీయాంశం అవుతున్నది. హైడ్రా పేరిట పేదలు, మధ్యతరగతి వర్గాలపై రేవంత్ సర్కారు ఉక్కుపాదం మోపుతున్నా, రాష్ట్ర ఆదాయం తగ్గుతున్నా, రాష్ట్రంలో కరువు తాండవిస్తున్నా.. ఆ పార్టీ నేతలు నోరు మెదపడమే లేదన్న విమర్శలు సొంత పార్టీ నుంచే వస్తున్నాయి. కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిన 100 రోజుల్లో ఆరు గ్యారెంటీలను అమలు చేస్తామని చెప్పి అధికారాన్ని చేజిక్కించుకున్నది. హామీలను మాత్రం విస్మరించింది. దీంతో ప్రజల్లో తీవ్ర వ్యతిరేకత వస్తున్నది. ఎక్కడికక్కడ కాంగ్రెస్ నేతలను ప్రజలు నిలదీస్తున్న పరిస్థితులు నెలకొన్నాయి. అయినా రాష్ట్రంలో బీజేపీ నేతలు నిమ్మకు నీరెత్తినట్టు వ్యవహరిస్తుండటం అనుమానాలకు తావిస్తున్నది. బీజేపీ నేతలు ప్రజల సమస్యల కన్నా సొంత ఎజెండాతోనే ముందుకు వెళ్తున్నారనే ప్రచారం జరుగుతున్నది. రాష్ట్ర బీజేపీలో ఇంత జరుగుతున్నా.. పార్టీ హైకమాండ్ దృష్టి సారించకపోవడం వెనుక బడే భాయ్, ఛోటే భాయ్‌కి ఉన్న సత్సంబంధాలే కారణమా? అనే ప్రశ్న ఉత్పన్నమవుతున్నది. శాసనసభ సమావేశాల్లో కూడా పార్టీ శాసనసభాపక్షం ఫ్లోర్ కోఆర్డినేషన్‌లో ప్రతిపక్షాలతో కాకుండా కాంగ్రెస్‌తో చేసుకుంటున్న సమన్వయమే ఎక్కువగా ఉంటున్నదని, అధికార పార్టీ విధానాలకు మద్దతు ఇస్తున్నట్టుగానే వారి శైలి ఉంటున్నదన్న విమర్శలు కూడా తొలి నుంచి ఉన్నాయి. పార్టీ ఎమ్మెల్యే రాజాసింగ్ ఇప్పుడు పార్టీ గురించి బహిరంగంగా మాట్లాడుతున్నారని, కానీ, పార్టీ కార్యకర్తలు ఎప్పటి నుంచో ఇదే విధమైన అభిప్రాయంతో ఉన్నారని విశ్లేషకులే చెప్తున్నారు.

దళిత విద్యపై.. కాంగ్రెస్ కత్తి!

మొదటిపేజీ తరువాయి...

చేస్తున్నది. దళితుల అభ్యున్నతికి కేసీఆర్ సర్కారు ఎంతగానో కృషి చేసింది. దళితవర్గాలకు ఉచితంగా నాణ్యమైన విద్య అందేలా బాటలు వేసింది. అందులో భాగంగా గురుకుల వ్యవస్థను బలోపేతం చేసింది. మరీ ముఖ్యంగా దళిత యువతులకు ఉన్నత విద్యావకాశాలను కల్పించడానికి, బాల్య వివాహాలను నివారించేందుకు గురుకుల కాలేజీలను ఏర్పాటు చేసింది. స్వరాష్ట్రం ఏర్పడే నాటికి 134 ఎస్సీ గురుకులాలు ఉండగా.. కేసీఆర్ సర్కారు మరో 134 గురుకులాలను ఏర్పాటు చేసి, వాటి సంఖ్యను 268కి పెంచింది. గురుకులాలను పదో తరగతి నుంచి ఇంటర్‌కు అప్‌గ్రేడ్ చేసింది. రాష్ట్రవ్యాప్తంగా దళిత విద్యార్థినుల కోసం 30 మహిళా డిగ్రీ గురుకుల కళాశాలలను ఏర్పాటు చేసింది. బద్వేల్, సంగారెడ్డి, ఇబ్రహీంపట్నం, మహేంద్రహిల్స్ తదితర కళాశాలల్లో పీజీ కోర్సులను కూడా ప్రవేశపెట్టింది. డిగ్రీ విద్యాతోపాటు కమ్యూనికేషన్ స్కిల్స్, సాఫ్ట్ స్కిల్స్ తదితర వాటిపై శిక్షణ ఇప్పించింది. కానీ, కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిన నాటి నుంచి ఎస్సీ గురుకుల వ్యవస్థను పూర్తిగా నిర్వీర్యం చేసింది.

కుదింపుపై ఆగ్రహం..

ప్రతీ డిగ్రీ మహిళా గురుకుల కాలేజీలో 7 కోర్సులను నిర్వహిస్తున్నారు. ఒక్కో కోర్సుకు 40 చొప్పున 280 సీట్లు అందుబాటులో ఉన్నాయి. మూడేండ్లకు కలిపి ఒక్కో డిగ్రీ కాలేజీలో 840 సీట్ల చొప్పున అన్నింటిలో కలిపి 25 వేల సీట్లు అందుబాటులో ఉండగా, వాటిలో చాలా వరకు భర్తీ కావడం లేదు. అందుకు అనేక కారణాలున్నాయి. వాటిపై దృష్టిసారించి, అడ్మిషన్లు పెరిగేలా చూడాల్సిన ప్రభుత్వం అందుకు విరుద్ధంగా, ప్రైవేట్ యాజమాన్యం తరహాలో నిర్ణయం తీసుకుంటున్నది. ఇప్పటికే విలీనం పేరిట పలు కాలేజీలను ఎత్తివేసింది. ఈ నేపథ్యంలో అడ్మిషన్లు లేవనే సాకుతో కళాశాలల కుదింపుపై ఉపాధ్యాయులు, విద్యార్థులు తీవ్రస్థాయిలో మండిపడుతున్నారు.

రాత్రికిరాత్రి తరలింపు...

గ్రామీణ మహిళల సాధికారత కోసం, సాయుధ దళాలకు మార్గదర్శకత్వం వహించేలా, ఉన్నత పౌరులుగా తీర్చిదిద్దాలనే ఉదాత్త లక్ష్యంతో కేసీఆర్ సర్కారు తెలంగాణ సోషల్ వెల్ఫేర్ రెసిడెన్షియల్ ఎడ్యుకేషనల్ ఇన్‌స్టిట్యూషన్స్ సొసైటీ పరిధిలో పలు ప్రత్యేక గురుకుల కాలేజీలను ఏర్పాటు చేసింది. అందులో భాగంగా యాదాద్రి భువనగిరి జిల్లా బీబీనగర్‌లో 2018లో తెలంగాణ సోషల్ వెల్ఫేర్ రెసిడెన్షియల్ ఆర్మ్డ్ ఫోర్సెస్ ప్రిపరేటరీ డిగ్రీ కాలేజ్ ఫర్ ఉమెన్‌ను ఏర్పాటు చేసింది. నాటి నుంచి అందులో సాయుధ దళాల కోసం బాలికలకు రక్షణకు సంబంధించి పలు అంశాలపై శిక్షణ అందిస్తున్నది. ఏటా కళాశాలలో చేరిన 150 మంది మహిళా క్యాడెట్లు ఆర్ట్స్, సైన్స్ లేదా కామర్స్‌లో బ్యాచిలర్ డిగ్రీలను అభ్యసించడంతోపాటు, నేషనల్ డిఫెన్స్ అకాడమీ (ఎన్‌డీఏ) పరీక్షకు సైతం సిద్ధమవుతున్నారు. ఈ కళాశాలను విద్యాసంవత్సరం మధ్యలోనే ఉన్నపళంగా బీబీనగర్ నుంచి ఘట్‌కేసర్‌కు తరలించారు. ఆర్మ్డ్ ఫోర్సెస్ కాలేజీ డైరెక్టర్ ఉద్యోగ విరమణ పొంది నెలలు గడిచినా కొత్తవారిని నియమించలేదు. ఇదిలా ఉంటే ఘట్‌కేసర్ పరిధిలోని అవుశాపూర్ క్యాంపస్‌లో బుద్వేల్, ఇబ్రహీంపట్న